www.prajasakti.com

ప్రజాశక్తి

గురువారం 21 డిసెంబర్ 2023

5

తూర్పుగోదావరి

చిలుకూరి కథకు ప్రథమ బహుమతి

ప్రజాశక్తి-కడియం

తెలుగు రాష్ట్రాల స్థాయిలో నిర్వహించిన సంక్రాంతి కథల పోటీలో కడియంకు చెందిన రచయిత చిలుకూరి శ్రీనివాసరావు మాస్టారు రాసిన 'ఎప్పుడెప్పుడు పండుగ' కథకు ప్రథమ బహుమతి లభించింది. విడదల నిహారిక ఫౌండేషన్, సాహితీ కిరణం సంయుక్త ఆధ్వర్యంలో సంక్రాంతి కథల పోటీ 2024 నిర్వహించారు. ఈ పోటీకి 110 కథలు రాగా తన కథ ప్రథమ కేటగిరీకి ఎంపికైనట్టు శ్రీనివాసరావు తెలిపారు. నిర్వహణా మండలి పొత్తూరి సుబ్బారావు, విడదల సాంబశివరావుల నుంచి తనకు ఎంపిక పత్రం అందినట్టు తెలిపారు. వచ్చే నెలలో హైదరాబాద్‌లో జరిగే బహుమతుల పురస్కారోత్సవంలో ప్రముఖుల చేతుల మీదుగా నగదు, ప్రశంసా పత్రం, జ్ఞాపిక చిలుకూరి అందుకోనున్నారు. జనవరి సాహితీ కిరణం మాసపత్రికలో ఈ కథ ప్రచురణ అవుతుందన్నారు.

సర్వత్రా నిరసన గళం

- నిరవధిక సమ్మెలోకి 'సమగ్ర శిక్ష' ఉద్యోగులు
- సేల్స్ ప్రమోషన్ ఎంప్లాయీస్ యాక్ట్ అమలు కోసం మెడికల్ రిప్స్
- భూ హక్కు చట్టం రద్దు కోసం న్యాయవాదులు
- వేతన సవరణ కోసం ఎల్ఐసి ఉద్యోగుల నిరసన

సమస్యల పరిష్కారం కోసం సర్వత్రా నిరసన గళం వినిపిస్తోంది. వేతనాలు అందించాలని, ఉద్యోగ భద్రత కల్పించాలంటూ సమగ్ర శిక్ష ఉద్యోగులు బుధవారం నుంచి నిరవధిక సమ్మెలోకి వెళ్లారు. భూ హక్కు చట్టం-2023ని రద్దు చేయాలంటూ న్యాయవాదులు చేస్తున్న ఆందోళన కొనసాగుతోంది. ఇందులో భాగంగా వారు ధర్నా చేసి నిరసన తెలిపారు. వేతన సవరణ చేయాలంటూ ఎల్ఐసి ఉద్యోగులు మధ్యాహ్న భోజన సమయంలో ధర్నా చేశారు. మరోపక్క మున్సిపల్ ఉపాధ్యాయులు సమస్య పరిష్కారం కోసం సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నాకు దిగారు. - రాజమహేంద్రవరం ప్రతినిధి

• నిరవధిక సమ్మెలోకి సమగ్ర శిక్ష ఉద్యోగులు

దీక్షలో పాల్గొన్న సమగ్ర శిక్ష ఉద్యోగులు

సమస్యల పరిష్కారం కోసం సమగ్ర శిక్ష కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఉద్యోగులు బుధవారం నిరవధిక సమ్మెకు దిగారు. డిఇఒ కార్యాలయం వద్ద సమ్మె శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఎస్ఎస్ఎ కాంట్రాక్టు ఉద్యోగులు, సిఆర్ఎంటిలకు, ఎంఐఎస్, సిఒలకు ఇచ్చిన హామీ ప్రకారం రెగ్యులర్ చేయాలని, తక్షణమే గ్రాస్ పే, ఎంటిఎస్, డిఎ, హెచ్ఆర్ఎ అమలు చేసి, వేతనం పెంచాలని, పార్ట్ టైం ఉద్యోగుల హోదా పెంచి, ఫుల్ టైం ఉద్యోగుల విధానాన్ని అమలు చేసి వేతనాలు పెంచాలని, ఉద్యోగ విరమణ వయస్సు 62 ఏళ్లకు పెంచాలని, ప్రతి నెలా ఒకటో తేదీనే వేతనాలు చెల్లించాలని, ఏడాదికి సరిపడా బడ్జెట్ ఒకేసారి విడుదల చేయాలని నినదించారు. వేతనంతో కూడిన మెడికల్ లీవులు మంజూరు చేయాలని, మెరుగైన హెల్త్ స్కీములు అమలు పరచాలని, సమగ్ర శిక్షలో పని చేస్తున్న అన్ని విభాగాల ఉద్యోగులను, ఉద్యోగ విద్యాశాఖలో విలీనం చేసి, ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. జిల్లాలోని 19 మండలాల నుంచి సుమారు 300 మంది ఉద్యోగులు సమ్మెలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్‌టియు రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎస్‌జె.త్రినాథ్‌బాబు, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.లక్ష్మణరావు, యుటిఎఫ్ అధ్యక్ష కార్యదర్శులు పి.జయకర్, ఎ.షరీఫ్, జిల్లా ఉద్యమ నాయకులు డివి.కృష్ణంరాజు, ఎం.రఘునాథ్, స్వర్ణాంధ్ర వద్ధాశ్రమం నిర్వాహకులు గుబ్బల రాంబాబు, ఎల్ఐసి ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు సతీష్, మునిసిపల్ టీచర్స్ ఫెడరేషన్ అధ్యక్షుడు ధరణి బాబు, కె.శ్రీనివాస్ సమ్మెకు సంఘీభావం తెలిపారు. న్యాయమైన డిమాండ్లు సాధించే వరకు సమ్మె కొనసాగిస్తామని స్పష్టం చేశారు.

• మెడికల్ రిప్స్ సమ్మె విజయవంతం

సమ్మెలో పాల్గొన్న మెడికల్ రిప్స్

ఫెడరేషన్ ఆఫ్ మెడికల్ అండ్ సేల్స్ రిప్రెసెంటేటివ్స్ అసోసియేషన్స్ ఆఫ్ ఇండియా, ఎపి మెడికల్ అండ్ సేల్స్ రిప్రెసెంటేటివ్స్ యూనియన్ పిలుపు మేరకు కోట గుమ్మం సెంటర్‌లో సమ్మె చేపట్టారు. రాష్ట్ర కార్యదర్శి ఎన్.సత్తిరాజు మాట్లాడుతూ దేశవ్యాప్తంగా ఉన్న సేల్స్ ప్రమోషన్ ఎంప్లాయీస్ అందరికీ ఎస్‌పిఇ యాక్ట్ 1976 వర్తింపజేయాలని, రిప్రెసెంటేటివ్స్ చేసే విధి విధానాలకు చట్టబద్ధత కల్పించాలని డిమాండ్ చేశారు. ఫైజర్ యూనియన్ నాయకులు సబ్బం కృష్ణ మాట్లాడుతూ, మందుల ధరలు తగ్గించాలని, మందులు, మెడికల్ ఉపకారణాలపై జిఎస్‌టి ఎత్తివేసి ప్రజలకు మందులు అందుబాటులోకి తీసుకురావాలని డిమాండ్ చేసారు. ఎల్ఐసి జాతీయ నాయకులు పి.సతీస్, నాయకులు రాజుగారు, సత్య దేవ్, రాజమండ్రి హోల్‌సేల్ అసోసియేషన్, కెమిస్ట్స్ అండ్ డ్రగ్గిస్ట్స్ అసోసియేషన్ నాయకులు ఎక్కల నాగేశ్వరరావు, స్వర్ణాంధ్ర సేవాసంస్థ ఫౌండర్ గుబ్బల రాంబాబు, సిఐటియు నాయకులు పవన్ పాల్గొని తమ మద్దతు ప్రకటించారు. అనంతరం సమ్మె సెంటర్ నుంచి రంగ్రీజ్ పేట, వాటర్ వర్క్స్ వీధి, పప్పులవీధి మీదుగా మెయిన్ రోడ్డు వరకూ ర్యాలీ చేపట్టారు. ఈ ఆందోళనలో గోపాల్, రణదీప్ సింగ్, దానేశ్వరరావు, రామకృష్ణ, రామ్‌కుమార్, సత్యనారాయణ, చందు పాల్గొన్నారు.

• భూ హక్కు చట్టం రద్దు కోసం న్యాయవాదులు

ధర్నా చేస్తున్న న్యాయవాదులు

రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చిన ప్రజా వ్యతిరేక ఎపి భూహక్కు చట్టాన్ని రద్దు చేయాలని కోరుతూ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు బుధవారం కోర్టు విధులను బహిష్కరించారు. బార్ అసోసియేషన్ నుంచి దేవీ చౌక్ మీదుగా వై.జంక్షన్ చేరుకుని అక్కడ మానవహారం నిర్వహించారు. నందం గనిరాజు సెంటర్ మీదుగా గణేష్ చౌక్, దేవీచౌక్, గోకవరం బస్ స్టాండ్ మీదుగా తిరిగి బార్ అసోసియేషన్ వరకు ప్రదర్శన నిర్వహించారు. ఈ చట్టం వల్ల ప్రజలకు జరిగే నష్టాలను కరపత్రాల ద్వారా ప్రజలకు పంపిణీ చేసి వివరించారు. ఆందోళనలో భాగంగా ఈ నెల 22 వరకూ న్యాయవాదులు విధులను బహిష్కరించాలని బార్ అసోసియేషన్ తీర్మానించింది. ఈ కార్యక్రమంలో ఎపి బార్ కౌన్సిల్ సభ్యుడు ముప్పాళ్ల సుబ్బారావు మాట్లాడుతూ ఈ చట్టం వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురి కావాల్సి వస్తుందన్నారు. సామాన్యులు సైతం తమ భూ హక్కులను కాపాడుకోవడం కష్ట సాధ్యం అవుతుందన్నారు. అధికార బలం, అంగ బలం, ధన బలం ఉన్నవారు భూ అక్రమణలకు పాల్పడడమే కాక, రెవెన్యూ అధికారులను సైతం తమకు అనుకూలంగా మార్చుకుని, అమాయకుల భూములను అక్రమంగా లాక్కొనే ప్రమాదం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో కవి హనుమంత రావు, ఎంవి.దుర్గా ప్రసాద్, గేదెల వెంకటేశ్వరరావు, రామారావు చౌదరి, కెవి.ప్రసాద్, సూరపురెడ్డి తాతారావు, జి.దేవీభవాని, దాసరి అమ్ములు, విక్టోరియా, వరలక్ష్మి, తవ్వల వీరేంద్రనాథ్, కె.సునీల్ లయనల్, బిజెఎస్.దివాకర్, టిఎస్ఆర్.మూర్తి (అంజిబాబు), బట్టు సునీల్ కుమార్, ధర్నాలకోట వెంకటేశ్వరరావు, కాశి శ్రీనివాసరావు, ఎంవి.రాఘవరెడ్డి, రాపాక రాధాకృష్ణ, తమ్మారెడ్డి ప్రాణిగ్రహి, అంబటి మురళి, వి.వెంకటేశ్వరావు, నరసింగ శ్రీనివాసు, పిఆర్‌పి.యాదవ్, ఎన్‌విఆర్‌విఎస్.ధర్మారావు, డి.కరుణాకర్ రాజు, కర్ర హనుమంతరావు, తదితరులు పాల్గొన్నారు.

• మున్సిపల్ ఉపాధ్యాయుల నిరసన

మున్సిపల్ ఉపాధ్యాయుల నిరసన

మున్సిపల్ ఉపాధ్యాయుల సమస్యలను తక్షణం పరిష్కరించాలని యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి ఎ.షరీఫ్ డిమాండ్ చేశారు. సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద మంగళవారం సాయంత్రం నాలుగు గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు ఉపాధ్యాయులు నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా షరీఫ్ మాట్లాడుతూ పాఠశాల విద్యాశాఖ పర్యవేక్షణలోకి మున్సిపల్ ఉపాధ్యాయులను తీసుకువస్తూ జిఒ 84ను ప్రభుత్వం విడుదల చేసిందని, దీనివల్ల మున్సిపల్ సమస్యలు పరిష్కారమవుతాయని భావించామన్నారు. మున్సిపల్ ఉపాధ్యాయుల డిడిఒ పవర్‌తోపాటు కొన్ని సమస్యలు పరిష్కారమైనా, ప్రధానమైన సమస్యలు పరిష్కారం కాలేదన్నారు. ప్రధానంగా బదిలీలు, ప్రమోషన్లు తక్షణం నిర్వహించాలని, మున్సిపల్ ఉన్నత పాఠశాలల్లో అన్ని పోస్టులూ అప్‌గ్రేడ్ చేయాలని, మున్సిపల్ టీచర్లకు పిఎఫ్ సౌకర్యం వెంటనే కల్పించాలని, మెడికల్ రీయంబర్స్‌మెంట్ బిల్లులు కొత్త డిడిఒల ద్వారా దరఖాస్తు చేసుకునే సౌకర్యం కల్పించాలని, పాఠశాలల అన్నింటికీ బోధనేతర సిబ్బందిని నియమించాలని, భవనాల అద్దె, కరెంట్ బిల్లులు చెల్లించాలని, అన్ని రకాల బకాయిలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. రెండో దశ కార్యాచరణలో అన్ని జిల్లా కేంద్రాల్లో సాయంత్రం 4 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు నిరసన కార్యక్రమాలకు పిలుపు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు పి.జయకర్, ఉపాధ్యక్షురాలు ఎం.విజయగౌరి, జిల్లా కార్యదర్శులు శ్రీమణి, రవిబాబు, రమేష్‌బాబు, దయానిధి, జి.అప్పారావు, జెవివి.సుబ్బారావు, తేజ, విజయ్ కుమార్, అనిత, గంగాధరరావు పాల్గొన్నారు.

• వేతన సవరణ కోసం ఎల్ఐసి ఉద్యోగులు

ఎల్ఐసి ఉద్యోగుల నిరసన

వేతన సవరణ కోసం తక్షణమే చర్చలు ప్రారంభించాలని డిమాండ్ చేస్తూ ఎల్ఐసి ఉద్యోగులు స్థానిక డివిజనల్ కార్యాలయం వద్ద బుధవారం భోజన విరామ సమయంలో ధర్నా నిర్వహించారు. ఈ సంధ్భంగా జోనల్ అధ్యక్షుడు పి.సతీష్, డివిజనల్ అధ్యక్షుడు గుబ్బల రాంబాబు మాట్లాడారు. ఎల్ఐసి ఉద్యోగుల డిమాండ్ల సాధనకు టోకెన్ సమ్మెకు జనవరి 10, 2024న ఒక గంట జాయింట్ ఫ్రంట్ పిలుపు నిచ్చిందన్నారు. అప్పటికీ స్పందన లేకుంటే తర్వాత ఉదతంగా పోరాటం కొనసాగుతుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు కె.అశోక్, డి.వీర కిషోర్, సత్యదేవ, మాథ్యూస్, శిరీష, జి.శ్రీనివాస్, విశ్వనాథ్, బి.శ్రీనివాసరావు, ఎస్.గన్నెయ్య, పట్నాయక్, దొరబాబు, పిఎస్ఎన్.రాజు, పి.సాయిబాబా, షఫీద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ పొదుపు వారోత్సవాల ముగింపు

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

వారోత్సవాల్లో విజేతలైన విద్యార్థులతో ఉన్నతాధికారులు

ఈ నెల 14వ తేదీ నుంచి నిర్వహించిన పునరుత్పాదక ఇంధన, పొదుపు వారోత్సవాలు బుధవారం ముగిశాయి. విద్యుత్ శాఖ ఎస్ఇ టివిఎస్.ఎన్‌మూర్తి మాట్లాడుతూ ఇంధన, పొదుపు ఆవశ్యకత గురించి వివరించారు. విద్యుత్‌ను పొదుపుగా ఉపయోగించడం వల్ల ఎక్కువ కాలం ఉపయోగించుకోవచ్చని తెలిపారు. అంతేకాక ముందు తరాలకు ఉపయోగ పడుతుందని సూచించారు. విద్యుత్ పొదుపులో భాగంగా ఎనర్జీ ఎఫిసియెంట్ పరికరాల ఆవశ్యకతను వివరించారు. అందరూ 5 స్టార్ రేటెడ్ విద్యుత్ పరికరాలను వినియోగించాలని, విద్యుత్ అవసరం లేనప్పుడు ఇంట్లో ఫ్యాన్, లైట్స్ ఆఫ్ చేసి పెట్టుకోవాలని, పగటిపూట సూర్యకాంతి ఉండడం వల్ల కిటికీలు తీసి ఆ వెలుతురులో ఇంట్లో పనులు చేసుకోవచ్చని దీనివల్ల మీకు కూడా విద్యుత్ ఆదా అవుతుందని తెలిపారు. విద్యార్థులకు నిర్వహించిన వ్యాసరచన, చిత్రలేఖనం, వక్తృత్వ పోటీలలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో డిఇ నక్కపల్లి శామ్యూల్, ఇఇ పి.ఉషారాణి, డిఇ ఎస్.దేవయ్య, టి.గాబ్రియేల్, అసిస్టెంట్ ఇంజినీర్లు, జూనియర్ ఇంజినీర్లు, పాల్గొన్నారు.

27న ఎంబిఎ, ఎంసిఎ కోర్సులకు స్పాట్ అడ్మిషన్స్

ప్రజాశక్తి-రాజానగరం

ఆదికవి నన్నయ యూనివర్సిటీ రాజమహేంద్రవరం, కాకినాడ, తాడేపల్లిగూడెం క్యాంపస్‌లకు సంబంధించిన ఎంబిఎ, ఎంసిఎ కోర్సుల్లో ప్రవేశాలకు ఈ నెల 27న స్పాట్ అడ్మిషన్స్ నిర్వహిస్తున్నామని, ఎపి ఐసెట్‌లో అర్హులైన అభ్యర్థులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని విసి ఆచార్య కె.పద్మరాజు తెలిపారు. బుధవారం యూనివర్సిటీలో దీనికి సంబంధించిన వివరాలను విసి తెలిపారు. ఆదికవి నన్నయ యూనివర్సిటీ ప్రాంగణంలో ఎంబిఎ, ఎంబిఎ టూరిజం అండ్ హాస్పిటాలిటీ, ఎంసిఎ కోర్సులలో ప్రవేశాలకు సంబంధించి ఎపి ఐసెట్ 2023లో అర్హత సాధించిన అభ్యర్థులని అన్నారు. రెగ్యులర్, ఇడబ్ల్యుఎస్, సెల్ఫ్ సపోర్టింగ్ కేటగిరీలో పరిమిత సీట్లు అందుబాటులో ఉన్నాయన్నారు. ఆదికవి నన్నయ యూనివర్సిటీ రాజమహేంద్రవరం ప్రాగణంలో ఎంబిఎ 11 సీట్లు, ఎంబిఎ టూరిజం అండ్ హాస్పిటాలిటీ 18 సీట్లు, ఎంసిఎ 8 సీట్లు ఉన్నాయన్నారు. కాకినాడ ప్రాగణంలో ఎంబిఎ 24, ఎంసిఎ 17 సీట్లు ఉన్నాయని, తాడేపల్లిగూడెం క్యాంపస్‌లో ఎంబిఎ 21 సీట్లు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. అభ్యర్థులు తమ సర్టిఫికెట్లతో స్పాట్ అడ్మిషన్స్‌కు హాజరుకావలెనని, అడ్మిషన్ నిర్ధారణ అయిన వెంటనే ఫీజు చెల్లించాలని తెలిపారు. స్పాట్ అడ్మిషన్ కు సంబంధించిన మరిన్ని వివరాలను యూనివర్సిటీ వెబ్‌సైట్ www.aknu.edu.in ద్వారా తెలుసుకోవచ్చునని అన్నారు.

వికలాంగుల జిల్లా కార్యదర్శిగా జోష్ బాబు

ప్రజాశక్తి-చాగల్లు

వికలాంగుల సంఘం జిల్లా కార్యదర్శిగా చాగల్లు గ్రామానికి చెందిన వైసిపి సీనియర్ నాయకులు ఉయ్యూరు జోష్ బాబు ఎన్నికయ్యారు. దీంతో ఎంపిపి మట్టా వీరస్వామి, గ్రామ సర్పంచ్ ఉన్నమట్ల మనశ్శాంతి, వైసిపి నాయకులు చెల్లింకుల దుర్గా మల్లేశ్వరరావు, జట్ట ఏడుకొండలు ఆయనను అభినందించారు. తనకు ఈ పదవి రావడానికి కృషి చేసిన హోమ్ మంత్రి డాక్టర్ తానేటి వనితకు కృతజ్ఞతలు తెలిపారు.

నలుగురికి విదేశీ విద్యాదీవెన మంజూరు

ప్రజాశక్తి-రాజమహేంద్రవరం రూరల్

విదేశీ విద్యా దీవెన చెక్కు అందిస్తున్న కలెక్టర్ కె.మాధవీలత

జిల్లాలో జగనన్న విదేశీ విద్యా దీవెన పథకం కింద నలుగురు విద్యార్థులకు రూ.39,33,582 ఆర్థిక సాయం మంజూరైనట్టు కలెక్టర్ డాక్టర్ కె.మాధవీలత పేర్కొన్నారు. వీరిలో 2023-24కి ఒకరికి కొత్తగా మంజూరు కాగా, 2022-23లో ముగ్గురికి మంజూరు కాగా వారికి మొదటి, రెండవ విడత నిధులు మంజూరైనట్టు తెలిపారు. బుధవారం ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహనరెడ్డి తాడేపల్లి సిఎం క్యాంపు కార్యాలయం నుంచి వర్చువల్ విధానంలో జగనన్న విదేశీ విద్యా దీవెన, జగనన్న సివిల్ సర్వీసెస్ ప్రోత్సాహకం నిధులను బటన్ నొక్కి లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేశారు. కలెక్టరేట్‌లో జిల్లా స్థాయి జగనన్న విదేశీ విద్య కార్యక్రమంలో కలెక్టర్ మాధవీలత, జెసి ఎన్.తేజ్ భరత్, మున్సిపల్ కమీషనర్ కె.దినేష్ కుమార్ లబ్ధిదారులతో కలిసి పాల్గొన్నారు. జిల్లాలో ఇప్పటి వరకు విదేశీ విద్యా దీవెన కింద ప్రస్తుతం నలుగురితో కలిపి మొత్తం 16 మందికి సాయం అందిస్తోందన్నారు. విద్యార్థులు కోర్సు పూర్తి చేసుకునేలా వారి చదువులు ఒక్కో మెట్టు ఎక్కే కొద్ది నాలుగు వాయిదాల్లో ప్రభుత్వం స్కాలర్‌షిప్స్ మంజూరు చేస్తోందన్నారు. ఇమ్మిగ్రేషన్ కార్డు (ఐ-94) పొందాక తొలి వాయిదా, మొదటి సెమిస్టర్ ఫలితాల తర్వాత 2వ వాయిదా, 2వ సెమిస్టర్ ఫలితాల తర్వాత 3వ వాయిదా, విజయవంతంగా కోర్సు పూర్తి చేసిన తరువాత 4వ సెమిస్టర్ పూర్తి చేసి మార్కుల ఆన్లైన్ పోర్టల్‌లో అప్‌లోడ్ చేశాక చివరి వాయిదా చెల్లిస్తున్నట్టు చెప్పారు. ఈ పథకం కింద రూ.8 లక్షల లోపు వార్షికాదాయం ఉన్న కుటుంబాలు అర్హులని తెలిపారు. ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనారిటీలకు రూ.1.25 కోట్ల వరకు, ఇతరులకు రూ.కోటి వరకూ ప్రభుత్వం విదేశీ విద్యకు అందిస్తున్నట్లు తెలిపారు. జగనన్న సివిల్ సర్వీసెస్ ప్రోత్సాహకంగా సివిల్ సర్వీస్ పరీక్షలో ప్రిలిమినరీ పరీక్ష పాసైన విద్యార్థులకు రూ.లక్ష, మెయిన్స్ పరీక్షలో ఉత్తీర్ణులైతే అదనంగా మరో రూ.50 వేల ప్రోత్సాహకం ప్రభుత్వం అందిస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో డిఎస్‌డబ్లుఒ ఎం.సందీప్, పిఎస్.రమేష్, విద్యార్థుల తల్లితండ్రులు పాల్గొన్నారు.

వితంతువుకు ఆర్థిక సాయం

ప్రజాశక్తి-కడియం

మండలంలోని వేమగిరి రామ్‌దాస్ పేటకు చెందిన కర్రి నూకాలమ్మ ఇటీవల భర్తను కోల్పోయింది. అతిచిన్న వయసులో వితంతువుగా మారి ముగ్గురు చిన్నారి ఆడపిల్లలతో కుటుంబ పోషణ కష్టమై ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు పడుతోంది. స్థానిక నాయకులు నూకాలమ్మ పరిస్థితిని వైసిపి రాజమహేంద్రవరం రూరల్ కోఆర్డినేటర్ చందన నాగేశ్వర్ దృష్టికి తీసుకు వెళ్లారు. స్పందించిన చందన బుధవారం నూకాలమ్మకు రూ.మూడు వేల సాయం అందజేశారు. ఇకమీదట కూడా ప్రతి నెల క్రమం తప్పకు రూ.మూడు వేలు సొంత నిధులు అందజేస్తానని హామీ ఇచ్చారు. నూకాలమ్మ చందనకు కృతజ్ఞతలు తెలిపారు.

స్థానిక నేతలకే ఎన్నికల్లో టిక్కెట్ ఇవ్వాలి

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

రానున్న ఎన్నికల్లో రూరల్ నియోజకవర్గంలో స్థానిక నాయకులకే టిక్కెట్ ఇవ్వాలని ఎపి ప్రజా సంఘాల జెఎసి అధ్యక్షుడు జెటి.రామారావు డిమాండ్ చేశారు. ప్రెస్ క్లబ్‌లో బుధవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. స్థానిక నాయకులను పక్కనపెట్టి మేం పంపించిన వారికే ఓటు వేయాలని పార్టీలు చెబితే గోబ్యాక్ అని పంపించేస్తామని హెచ్చరించారు. స్థానిక నాయకులకు సీటు ఇస్తామని ఎన్నికలు వచ్చేవరకు వాడుకుని ఇప్పుడు అమరావతిలో కూర్చుని వలస పక్షులకు టిక్కెట్ ఇవ్వడం సమంజస కాదని హితవు పలికారు. బయటివారిని బలవంతంగా రుద్దితే ఓట్ ఫర్ లోకల్ సీటు ఫర్ లోకల్ నినాదంతో వారిని చిత్తుగా ఓడిస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో ఎపి పజాసంఘాల ప్రతినిధులు బండారు కోదండం, ఆర్.సత్యనారాయణ, డి.మాధురి, ఎం.సుబ్బలక్ష్మి, సుబ్బారావు, సురేష్, జి.వి.రమణ, టి.ప్రసాద్ పాల్గొన్నారు.

కార్టూ'నిజం'



అలా అయితే...మనం బలహీనులం అయిపోతాం.. కద్సార్..!!

అంగన్‌వాడీ కేంద్రాల్లో అందని ఆహారం

తాళాలు పగులగొట్టినా నిర్వహణ శూన్యం

అంగన్‌వాడీలు లేకుండా పిల్లలను పంపబోమంటున్న తల్లులు

ప్రభుత్వ తీరుపై సర్వత్రా నిరసన

ప్రజాశక్తి - ఉంద్రాజవరం

వారం రోజులుగా సాగుతున్న అంగన్‌వాడీల సమ్మెను ప్రభుత్వం పరిష్కరించని ఫలితంగా పసిపిల్లలు, గర్భిణులు, బాలింతలకు పోషకాహారం అందడం లేదు. ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల తాళాలు పగలగొట్టి, పిల్లలకు పోషకాహారం అందజేయాలని ఆర్భాటంగా ఆర్డర్లు జారీ చేసినప్పటికీ, వాస్తవ పరిస్థితి అందుకు భిన్నంగా ఉంది. వాలంటీర్లు అంగన్‌వాడీ కేంద్రాలను తెరచి, పిల్లల ఇళ్లకు వెళ్లి, కేంద్రాలకు పంపించాలని తల్లిదండ్రులను అడిగినప్పటికీ, అలవాటైన టీచర్లు, ఆయాలు రాకపోవడంతో తల్లిదండ్రులకు వాలంటీర్లపై నమ్మకం కుదరక పిల్లలను కేంద్రాలకు పంపించడం లేదు. అరకొర పిల్లలు కొన్ని కేంద్రాలకు వస్తున్నప్పటికీ, వారికి పోషకాహారం పూర్తిస్థాయిలో అందట్లేదు. వారికి వండి పెట్టాలా, మధ్యాహ్న భోజనం నుంచి వారికి ఆహారం అందజేయాలా అనే విషయంలో వాలంటీర్లకు సరియైన సమాచారం కొరవడింది. ఇప్పటికే నిల్వ ఉన్న కోడిగుడ్లు, కొన్ని ఆహార పదార్థాలు చెడిపోయే పరిస్థితి కనిపిస్తోంది.

మండలంలో మొత్తం 63 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. ఆరు నెలల నుంచి మూడేళ్ల పిల్లలు 1,579 మంది, మూడు నుండి ఆరేళ్ల పిల్లలు 1,862 మంది, బాలింతలు 350 మంది, గర్భిణులు 311 మందికి ప్రభుత్వ పోషకాహారం అందాల్సి ఉంది. అంగన్‌వాడీలు లేకుండా నిర్వహణ కష్టసాధ్యమని, పిల్లల ఆలనాపాలనా చూసేవారు లేక పంపట్లేదని, ఎప్పటిలా పని చేస్తే పంపించేవాళ్లమని ఓ చిన్నారి తల్లి పోతాబత్తుల రాజేశ్వరి చెబుతున్నారు. ప్రభుత్వం అంగన్‌వాడీలతో చర్చలు జరిపి సమ్మెను విరమింపజేయాలని, అంగన్‌వాడీ కేంద్రాలను మళ్లీ పూర్తిస్థాయిలో తెరవాలని పిల్లల తల్లిదండ్రులు, గర్భిణులు, బాలింతలు కోరుతున్నారు. ప్రభుత్వం ఒక్కసారి ఆలోచించి, సత్వరమే తగిన చర్యలు తీసుకోవాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

కేంద్రాల్లో నిల్వ ఉన్న గుడ్లు, ఇతర ఆహార పదార్థాలు

శిక్షణలో పాల్గొన్న ఉపాధి హామీ శ్రమ మిత్రలు

ఉపాధి హామీ శ్రమ మిత్రలకు శిక్షణ

ప్రజాశక్తి- గోకవరం

మండల కేంద్రమైన గోకవరం ఉపాధి హామీ పథకం కార్యాలయంలో బుధవారం ఉపాధి హామీ పథకం శ్రమ మిత్రలకు 4వ రోజు శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ శిక్షణ తరగతులలో ఎపిఒ పిఎస్ అప్పలరాజు ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈ శిక్షణ తరగతులకు మల్లవరం, కృష్ణునిపాలెం, తంటికొండ, గోకవరం గ్రామాలకు చెందిన 50 మంది ఉపాధి హామీ పథకం శ్రమ మిత్రలకు శిక్షణ ఇచ్చామన్నారు. ఈ శిక్షణలో మస్తరు నిర్వహణ, ఎన్ఎంఎం ద్వారా హాజరు పంపడం, గ్రూపు నుంచి డిమాండ్ సేకరించడం, జాబ్ కార్డ్ అప్‌డేట్, పని ప్రదేశంలో సౌకర్యాలు కల్పించడం, రోజువారీ వేతనం రూ.272 పొందుటకు అవసరమైన కొలతలు, ఫారం పాండ్, రింగు ట్రెంచ్, పుంత రోడ్లు, పంట కాలవలలు మొదలైన అంశాలపై ముగ్గు వేసి మార్కింగ్ చేయుడంపై శిక్షణ ఇచ్చినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిఆర్‌పిఎస్ జెఇ ఎ.రత్న రాజు, టిలె పి.సింహాద్రి, మోహన్ రావు, రామ్‌ప్రసాద్ శ్రమ మిత్రలు పాల్గొన్నారు.

భిక్షాటనతో అంగన్‌వాడీల నిరసన

అంగన్‌వాడీల నిరవధిక సమ్మె బుధవారం 9వ రోజుకు చేరింది. పలుప్రాంతాల్లో భిక్షాటన చేసి అంగన్‌వాడీలు నిరసన తెలిపారు.

ప్రజాశక్తి-యంత్రాంగం

రాజమహేంద్రవరం టిటిడి కల్యాణ మండపం వద్ద గల ఐసిడిఎస్ ప్రాజెక్టు కార్యాలయం వద్ద తొమ్మిదో రోజు సమ్మె కొనసాగింది. భిక్షాటన చేస్తూ అంగన్‌వాడీలు నిరసన తెలిపారు. యూనియన్ రాజమండ్రి ప్రాజెక్ట్ అధ్యక్ష కార్యదర్శులు, కోశాధికారి శారద, సునీత, రామలక్ష్మి మాట్లాడారు. ప్రభుత్వం ఇప్పటికైనా చర్చలు జరిపి వేతనాల పెంపు, గ్రాట్యూటీ అమలు, రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఇతర డిమాండ్లు పరిష్కరించాలని కోరారు.

రాజానగరం సాయి బాబా గుడి సమీపంలో రిలే దీక్షలు చేపట్టారు. దుకాణాల వద్ద భిక్షాటన చేశారు. మార్తమ్మ, కార్యదర్శి వై.సుజాత, ఏడుకొండలు, ఎన్.సుజాత, శ్రీదేవి, సరస్వతి, వెంకటలక్ష్మి, విశాలి తదితరులు పాల్గొన్నారు.

గోకవరం తహశీల్దార్ కార్యాలయం వద్ద చేపట్టిన దీక్షలకు పలువురు తెలుగుదేశం, కాంగ్రెస్, జనసేన పార్టీ నాయకులు దీక్షా శిబిరం వద్దకు వచ్చి సంఘీభావం తెలిపారు.

గోపాలపురం ప్రాజెక్టు పరిధిలో వంటా వార్పు కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సిఐటియు జిల్లా అధ్యక్షుడు ఎం.సుందర బాబు, జిల్లా ఉపాధ్యక్షుడు ఎస్.భగత్, జిల్లా నాయకులు కె.వెంకటరావు, టిపి.లక్ష్మి, అంగన్‌వాడీ ప్రాజెక్టు అధ్యక్షులు కె.విమల, నల్లజర్ల, గోపాలపురం అంగన్వాడి యూనియన్ నాయకురాలు రామలక్ష్మి పాల్గొన్నారు.

సీతానగరం ఆర్‌టిసి బస్టాండ్ వద్ద నుంచి నాలుగు బొమ్మల సెంటర్ మీదుగా ర్యాలీ నిర్వహించారు. సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి రాజులోవ, అంగన్వాడీ వర్కర్స్ యూనియన్ జిల్లా ఉపాధ్యక్షురాలు అన్నపూర్ణ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కోరుకొండ సెక్టార్ ప్రధాన కార్యదర్శి సుబ్బలక్ష్మి, మండల అధ్యక్షురాలు సిహెచ్ సువర్ణ, సెక్టార్ లీడర్లు సుభాషిణి, ఉమాదేవి, ప్రశాంతి, వెంకట్ లక్ష్మి వెంకటేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

రాజమహేంద్రవరంలో..

సీతానగరంలో..

గోపాలపురంలో..

గోకవరంలో..

ధర్నా చేస్తున్న విద్యార్థులు

హాస్టళ్లలో వసతులు కల్పించాలి

ప్రజాశక్తి-రాజమహేంద్రవరం

సాంఘిక సంక్షేమ హాస్టల్లో మౌలిక వసతులు కల్పించాలని కోరుతూ సబ్ కలెక్టర్ వద్ద ఎఐఎస్ఎఫ్ ఆధ్వర్యాన బుధవారం ఆందోళన చేపట్టారు. సంఘం జిల్లా అధ్యక్షుడు చింతలపూడి సునీల్ మాట్లాడుతూ సంక్షేమ హాస్టళ్లలో పరిస్థితి అధ్వానంగా తయారయ్యిందని, విద్యార్థులకు బెడ్లు, దుప్పట్లు, ట్రంకు పెట్లు మొదలైనవి ఇవ్వాలని బాత్రూం టాయిలెట్స్ ఉన్నా మెయింటినెన్స్ కరువైందన్నారు. ఖాళీగా ఉన్న కుక్, కమాటీ, వాచ్‌మాన్ పోస్టులు భర్తీ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాస్, సిహెచ్.సురేష్, కె.శంకర్, వై.సునీల్, స్టాలిన్, వినోద్ పాల్గొన్నారు.

రామ్‌ప్రసాద్‌ను సన్మానిస్తున్న ఉద్యోగులు

'బొలిశెట్టి'కి ఘన సన్మానం

ప్రజాశక్తి-చాగల్లు

ఎంపిడిఒగా నాలుగేళ్లపాటు సేవలందించిన బొలిశెట్టి రామ్‌ప్రసాద్‌ను బుధవారం సాయంత్రం 6 గంటలకు మండలంలోని నేలటూరు సీతారామ కళ్యాణ మండపంలో ఘనంగా సత్కరించారు. ఇన్‌ఛార్జి ఎంపిడిఒ పాతూరి నిర్మల కుమారి అధ్యక్షతన మండల పరిషత్ కార్యాలయ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు, గ్రామ సచివాల సిబ్బంది అభినందన సభ ఏర్పాటు చేశారు. ఎంపిపి మట్టా వీరస్వామి మాట్లాడుతూ మండలాభివృద్ధికి రామ్ ప్రసాద్ ఎంతో కృషి చేశారని చెప్పారు. ఆయన ఉద్యోగోన్నతిపై వెళ్లడం అభినందనీయమన్నారు. తహశీల్దారు కె.రాజ్యలక్ష్మి, సర్పంచులు ఆయన సేవలు కొనియాడారు. రామ్‌ప్రసాద్ మాట్లాడుతూ తను చాగల్లు మండలంలో నాలుగేళ్లు సేవలందించానని, తనపై చూపిన అభిమానానికి కృతజ్ఞతలు తెలిపారు.

ప్రభుత్వాసుపత్రి ప్రారంభం ఎప్పుడో?

ప్రజాశక్తి-గోకవరం

మండల కేంద్రమైన గోకవరంలో నూతనంగా నిర్మిస్తున్న ప్రభుత్వాసుపత్రి ఎప్పుడు ప్రారంభమవుతుందోనని ప్రజలు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. మండల కేంద్రం, ఏజెన్సీ ముఖద్వారమైన గోకవరంలో ప్రభుత్వపరంగా సరైన వైద్య సౌకర్యాలు లేవు. దీంతో 50 ఏళ్లుగా స్థానికులు ప్రైవేట్ ఆసుపత్రులను ఆశ్రయిస్తున్నారు. గోకవరం పరిసర గ్రామ ప్రజలకు అత్యవసరం పరిస్థితి ఎదురైనప్పుడు, ప్రమాదాల సమయంలో వైద్య సహాయం కోసం రాజమండ్రిలోని ప్రైవేట్ ఆసుపత్రులను ఆశ్రయిస్తున్నారు. దీంతో వైద్యం నిమిత్తం స్థానికులు రూ.వేలాదిగా ఖర్చు పెట్టాల్సిన పరిస్థితి నెలకొంది. గోకవరంలో ప్రభుత్వాసుపత్రి నిర్మాణానికి గతంలో మాజీ ముఖ్యమంత్రి కిరణ్ కుమార్ రెడ్డి, మాజీ మంత్రి తోట నరసింహం శంకుస్థాపన చేసినప్పటికీ కార్యరూపం దాల్చలేదు. వైసిపి ప్రభుత్వం అధికారంలో వచ్చిన తర్వాత ప్రస్తుత ఎంఎల్ఎ జ్యోతుల చంటిబాబు రూ.ఆరు కోట్ల 50 లక్షల వ్యయంతో 50 పడకల ఆసుపత్రి నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఆసుపత్రి శంకుస్థాపన చేసి రెండేళు గడిచిన అనంతరం ప్రస్తుతం ఆసుపత్రి నిర్మాణం చివరి దశకు చేరుకుంది. ఈ నెల 20న ఆసుపత్రి ప్రారంభం జరుగుతుందని, అధికారులు తెలియజేసినప్పటికీ ఇంకా ఆసుపత్రి నిర్మాణంలో కొన్ని అత్యవసర పనులు నిలిచిపోవడంతో ఆస్పత్రి ప్రారంభం మరింత ఆలస్యం కానుంది. ఆసుపత్రి నిర్మాణాన్ని త్వరలోనే పూర్తి చేసి ఈ నెలాఖరుకు ఆసుపత్రి ప్రారంభోత్సవం జరుగుతుందని అధికారులు చెప్పిన మాటలను స్థానికులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఆసుపత్రి ప్రారంభమైతే రోగులకు కావాల్సిన అత్యవసర సేవలు మరింత మెరుగైన వైద్య సౌకర్యాలు ప్రజలకు అందుతాయని స్థానికులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

నిర్మాణంలో ఉన్న ఆసుపత్రి

తరలి వెళుతున్న కార్యకర్తలు

టిడిపి సభకు తరలిన కార్యకర్తలు, నాయకులు

ప్రజాశక్తి - ఉండ్రాజవరం, పెరవలి

విజయనగరం జిల్లా పోలిపల్లిలో బుధవారం జరగనున్న తెలుగుదేశం పార్టీ యువగళం నవశకం బహిరంగసభకు ఉండ్రాజవరం మండలంలోని వేలివెన్ను నుంచి టిడిపి, జనసేన పార్టీల అభిమానులు, గ్రామ నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో తరలి వెళ్లారు. మండలంలోని పలు గ్రామాల నుంచి టిడిపి అభిమానులు ఉదయం 6 గంటలకే నిడదవోలు మాజీ ఎంఎల్ఎ బూరుగుపల్లి శేషారావు ఇంటి వద్దకు, వేలివెన్ను చేరుకున్నారు. అక్కడి నుంచి జనసేన జిల్లా నాయకులు పాల వీరాస్వామితో కలిసి శేషారావు జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. 180 వాహనాల్లో సుమారు 1200 మంది భారీ ర్యాలీగా బయల్దేరి వెళ్లారు. ఈ సందర్భంగా శేషారావు మాట్లాడుతూ జనసేన, టిడిపి పార్టీల సమన్వయంతో రానున్న సార్వత్రిక ఎన్నికల్లో వైసిపి చిత్తుగా ఓడించడం ఖాయమన్నారు.

పెరవలి మండలం నుంచి తెలుగుదేశం, జనసేన పార్టీ నాయకులు యువగళం విజయోత్సవ సభకు తరలి వెళ్లారు. టిడిపి సీనియర్ నాయకులు కుందుల సత్యనారాయణ, రామాంజనేయులు, జనసేన నాయకులు అతికాల రామకృష్ణమ్మ, పిప్పర రవికుమార్, కోటిపల్లి మురళీకృష్ణ, మేడిచర్ల భాస్కర శివకుమార్, రాధాకృష్ణ, మాణిక్ రెడ్డి, మురళీకృష్ణ, పంపన మావుళ్లుపాల్గొన్నారు.

5న మిడ్డే మీల్స్ కార్మికుల చలో విజయవాడ

ప్రజాశక్తి-సీతానగరం

జనవరి 5న మధ్యాహ్న భోజనం కార్మికులు చలో విజయవాడ కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి బి.రాజులోవ తెలిపారు. బుధవారం సీతానగరంలో ఎపి మధ్యాహ్న భోజనం కార్మిక సంఘం సమావేశంలో రాజులోవ మాట్లాడారు. మధ్యాహ్న భోజన కార్మికులకు కనీస వేతనం అమలు చేయాలని, గ్యాస్ సరఫరా చేయాలని, ఇన్సూరెన్స్ కల్పించాలని, యూనిఫామ్, ఐడి కార్డ్ ఇవ్వాలని, పెండింగ్ బిల్లులు విడుదల చేయాలని, రాగి మాల్ట్‌కు అదనపు వేతనం ఇవ్వాలని తదితర డిమాండ్లతో జనవరి 5వ తేదీన విజయవాడ అలంకార సెంటర్లోని ధర్నాచౌక్‌లో ధర్నా కార్యక్రమం చేపట్టినట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లాలోని మధ్యాహ్న భోజనం కార్మికులంతా పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో ఎపి మధ్యాహ్న భోజనం కార్మిక సంఘం గౌరవాధ్యక్షులు దేవయాని, అధ్యక్షులు ఎల్లారీశ్వరి, కుమారి, రాఘవ, దేవి పాల్గొన్నారు.

అంగన్‌వాడీ సెంటర్ల బాధ్యతలు వద్దు

అంగన్‌వాడీల సమ్మె నేపథ్యంలో ఆ కేంద్రాల పిల్లలకు భోజనం వండి పెట్టాలని మధ్యాహ్నం భోజనం కార్మికులపై ప్రభుత్వం ఒత్తిడి చేయడం తగదని ఎపి మధ్యాహ్న భోజన కార్మిక సంఘం మండల అధ్యక్షులు ఎల్లారీశ్వరి అన్నారు. అంగన్వాడీలకు మధ్యాహ్న భోజనం వండి పెట్టే బాధ్యతను తమకు అప్పగించవద్దని కోరారు. అంగన్‌వాడీల నాయకత్వంతో చర్చలు జరిపి, వారి సమస్యలు పరిష్కరించి సమ్మె విరమింప జేయాలని, అంగన్‌వాడీల పోరాటానికి మధ్యాహ్న భోజన కార్మికుల మద్దతు ఉంటుందని తెలిపారు.

ఆరోగ్యశ్రీ కార్డులు పంపిణీ చేస్తున్న చందన

ఆరోగ్యశ్రీ పెంపు చారిత్రాత్మకం

ప్రజాశక్తి-కడియం

దేశంలో ఎక్కడా లేని విధంగా వైయస్సార్ ఆరోగ్యశ్రీ పథకంలో కుటుంబానికి రూ.25 లక్షలు వైద్యం కోసం కేటాయిస్తూ ముఖ్యమంత్రి జగనన్న తీసుకున్న పథకం ఒక చారిత్రాత్మకమని వైసిపి రూరల్ కో ఆర్డినేటర్ చందన నాగేశ్వర్ పేర్కొన్నారు. మండలంలోని జేగురుపాడులో ఆరోగ్యశ్రీ కార్డుల పంపిణీ కార్యక్రమం గ్రామ సర్పంచ్ యాదల సతీష్ చంద్ర స్టాలిన్ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా చందన మాట్లాడుతూవైద్యం ఖర్చు వెయ్యి దాటితే ఆరోగ్యశ్రీ వర్తించేలా మార్పులు చేశారని, రాష్ట్రవ్యాప్తంగా కొత్త ఫీచర్లతో స్మార్ట్ ఆరోగ్యశ్రీ కార్డుల పంపిణీ చేస్తున్నారని వైద్యానికి అత్యధిక ప్రాధాన్యత ఇస్తూ, ఇంటికే వైద్యాన్ని అందిస్తున్నారన్నారు. జేగురుపాడు పంచాయతీ పరిధిలో 791 ఆరోగ్యశ్రీ కార్డులు ఇచ్చామని అన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు దొంతంశెట్టి వీరభద్రయ్య, బత్తుల రాము, ఈలి గోపాలం, కొండపల్లి పట్టియ్య, తోకల శ్రీనివాస్, సాపిరెడ్డి సూరిబాబు, వెంకన్న, శాకా కిరణ్, కామేష్ తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తలు గ్రామాల్లో పని చేయాలి

ప్రజాశక్తి-నల్లజర్ల

టిడిపిని తిరిగి అధికారంలోకి తెచ్చేందుకు ప్రతి కార్యకర్తా క్షేత్రస్థాయిలో పని చేయాలని పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, గోపాలపురం నియోజకవర్గ ఇన్చార్జ్ మద్దిపాటి వెంకటరాజు అన్నారు. సోమవారం అచ్చన్నపాలెం, అనంతపల్లి, కృష్ణమ్మగూడెంలో టిడిపి గ్రామ సభలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడుతూ వైసిపి నాయకులు చేస్తున్న అరాచకాలు, దౌర్జన్యాలను గ్రామస్థాయిలో వివరించాలన్నారు. రానున్న ఎన్నికల్లో గోపాలపురం నియోజవర్గంలో టిడిపి ఘన విజయం సాధిస్తుందన్నారు. కార్యకర్తలు ప్రజా సమస్యలపై సమయాన్ని కేటాయించి సమస్యలకు పరిష్కారం చూపించే విధంగా పని చేయాలని కోరారు.

ఆరోగ్యశ్రీ కార్డుల పంపిణీ

ప్రజాశక్తి - పిఠాపురం

మండలంలోని లక్ష్మీ నరసాపురం గ్రామంలో బుధవారం స్మార్ట్ ఆరోగ్యశ్రీ కార్డులను స్థానిక ఎంఎల్ఎ పెండెం దొరబాబు చేతుల మీదుగా అందజేశారు. లక్ష్మీనరసాపురంలో సర్పంచ్ ఏడుకొండలు అధ్యక్షతన జరిగిన ఆరోగ్యశ్రీ నూతన కార్డుల పంపిణీ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ పేద, సామాన్య ప్రజలను దృష్టిలో ఉంచుకుని రూ.5 లక్షల నుంచి రూ.25 లక్షలకు పెంపుదల చేసినట్లు తెలిపారు. అనంతరం 581 మంది లబ్ధిదారులకు ఆరోగ్యశ్రీ స్మార్ట్ కార్డులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి కన్నాబత్తుల కామేశ్వరరావు, జడ్‌పి వైస్ ఛైర్మన్ బుర్రా అనుబాబు, గండేపల్లి బాబీ, విరవ పిహెచ్‌సి వైద్యాధికారిణి ఇందిర, సిబ్బంది, సర్పంచులు నడిగట్ల చింతలరావు, నల్లా రాంబాబు, ఎంపిటిసి సభ్యులు జవ్వాది వాడపల్లి, నాయకులు బాలిపల్లి రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.

ఆత్మీయ కలయిక జయప్రదానికి పిలుపు

ప్రజాశక్తి-అంబాజీపేట

మాజీ ఎంపీ హర్షకుమార్ అమలాపురం ప్రాంతం కోడూరుపాడు లో ఈనెల 22న నిర్వహించే ఆత్మీయ కలయికను విజయవంతం చేయాలని అభిమాన శ్రేణులు పిలుపునిచ్చాయి. పుల్లేటికుర్రు లో సర్పంచ్ జల్లి బాలరాజు అధ్యక్షతన బుధవారం ఆత్మీయ కలయిక పోస్టర్ ను ఆవిష్కరించారు. ముఖ్య అతిథి మాజీ ఎంఎల్ఎ మాట్లాడుతూ రెండు తెలుగు రాష్ట్రాల నుంచి అభిమానులకు ఆహ్వానం పలకామన్నారు.కార్యక్రమంలో జనసేన జిల్లా ఉపాధ్యక్షులు ఎస్. వెంకటేశ్వరరావు, మాజీ సర్పంచులు నూకపెయ్యి చిన్న, కాంగ్రేగుల గోపాలకృష్ణ, డి.సాయి కృష్ణ, ప్రభాకర్ రావు తదితరులు పాల్గొన్నారు.

పుల్లేటికుర్రులో హర్ష కుమార్ ఆత్మీయ కలయిక పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

రోడ్ల నిర్మాణాల పూర్తికి చర్యలు

ప్రజాశక్తి-అమలాపురం రూరల్

సార్వత్రిక ఎన్నికల లోపుగా స్థానిక అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో అన్ని సిసి రోడ్ల నిర్మాణాన్ని పూర్తి చేసేందుకు అన్ని చర్యలు చేపట్టినట్లు రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్ పేర్కొన్నారు. బుధవారం బండారులంక గ్రామం నుండి దంగేటి వారి పాలెం వరకు సిసి రోడ్ నిర్మాణ పనులకు పాలగుమ్మి- చప్పిడి వారి పాలెం సిసి రోడ్ల నిర్మాణ పనులకు భూమి పూజ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గ పరిధిలో సుమారు రూ.2.5కోట్ల మేర సిసి రోడ్ల పనులకు శంకుస్థాపన చేశామన్నారు. కొన్ని సిసి రోడ్ల నిర్మాణాల పనులు టెండర్ దశలో ఉన్నాయని వాటిని కూడా సంక్రాంతి లోపు పూర్తి చేసేందుకు రహదారులు భవనాల శాఖ అధికారులను ఆదేశించామన్నారు. కార్యక్రమంలో ఎంఎల్‌సి కుడిపూడి సూర్యనారాయణ రావు, వ్యవసాయ మార్కెటింగ్ కమిటీ ఛైర్మన్ దంగేటి డోలామణి రుద్ర, ఎంపిపి కుడుపూడి భాగ్యలక్ష్మి, జెడ్‌పిటిసి సభ్యుడు పందిరి శ్రీహరి వేణుగోపాల్ పాల్గొన్నారు.

ఎన్నికల సమాచారాన్ని సిద్ధం చేయాలి

-వార్షిక తనిఖీల్లో డిఐజి అశోక్‌కుమార్ ఆదేశం

ప్రజాశక్తి - కాకినాడ

రాబోయే ఎన్నికలకు సంబంధించి రాష్ట్ర కేంద్రంలోని ఉన్నతాధికారులకు అవసర మైన సమాచారాన్ని సన్నద్ధం చేయాలని ఏలూ రు రేంజ్ డిఐజి జివిజి.అశోక్ కుమార్ ఆదేశిం చారు. వార్షిక తనిఖీల్లో భాగంగా బుధవారం జిల్లా ఎస్‌పి కార్యాలయంలో ఆయన తనిఖీలు చేశారు. జిల్లా పోలీసు కార్యాలయ పరిపాల నాధికారి శివరామరాజు, సంబంధిత విభాగాల మినిస్టీరియల్ సిబ్బంది వారి విభాగాల వారీగా సమర్పించిన వార్షిక ప్రగతి నివేదికలను ఆయన పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న ఎన్నికల దృష్ట్యా ఎన్నికల బందోబస్తు నిర్వహించే జిల్లా పోలీసు అధికారులు, సిబ్బంది యొక్క సంక్షే మం, ఇతర విధి నిర్వహణ అవసరాల నిమిత్తం సకాలంలో స్పందించేలా సంసిద్ధంగా ఉండా లని ఆదేశించారు. ఇతర ఎన్నికల సంబంధిత ఉన్నతాధికారులకు అందించేలా సిద్ధం చేయాల న్నారు. పోలీసు స్టేషన్ స్థాయి నుంచి రావాల్సి న సమాచారాన్ని సేకరించేందుకు ఇప్పటి నుంచే సిబ్బందికి అవగాహన కల్పించాలని అన్నారు. అనంతరం డిసిఆర్‌బి, డిటిఆర్‌బి, స్పెషల్ బ్రాంచ్ కీలక విభాగాల వార్షిక పనితీరు నివేది కలను ఆయన పరిశీలించారు. పోలీసు పరేడ్ మైదానంలో సాయుధ బలగాల కవాతును వీక్షిం చి గౌరవ వందనాన్ని స్వీకరించారు. ఈ తనిఖీ లో ఎస్‌పి ఎస్.సతీష్ కుమార్, ఎస్‌పి(అడ్మిన్) పి.శ్రీనివాస్, ఆర్మ్డ్ రిజర్వ్ అడిషనల్ ఎస్‌పి బి.సత్యనారాయణ, జిల్లా పోలీసు కార్యాలయ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ శివరామరాజు పాల్గొన్నారు.

పోలీసు పరేడ్‌లో గౌరవ వందనం స్వీకరిస్తున్న డిఐజి

సాంస్కృతిక కార్యక్రమాల్లో విద్యార్థినులు

ఉత్సాహంగా హ్యాక్‌థాన్ పోటీలు

ప్రజాశక్తి - గండేపల్లి

సూరంపాలెం ఆదిత్య ఇంజనీరింగ్ కళాశాలలో జరుగు తున్న స్మార్ట్ ఇండియా హ్యాకథాన్ 2023 గ్రాండ్ ఫినాలే పోటీలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన విద్యార్థులు ఎంతో ఉత్సాహంగా పాల్గొని తమ ఆలోచనలకు పదును పెడుతున్నారు. ఈ కార్యక్రమం మంగళవారం రాత్రి ఒంటి గంట లకు విద్యార్థులు ఆటవిడుపు కోసం సరదాగా ఆడి పాడి అలరించారు. తమలో విజ్ఞానదాయక నైపుణ్యమే కాదు సాంస్కృతిక ప్రావీణ్యం కూడా ఉందని నిరూపిస్తూ డాన్సులు, గాన కచేరీలు చేశారు. చలిని సైతం లెక్క చేయకు నిద్రను దరిచేరనీయకుండా విద్యార్థులు ఈ విధంగా ఆటపాట లతో సరదాగా గడుపుతూ తమ ఆవిష్కరణలను కొనసా గించారు. బుధవారం ఉదయం 5 గంటలకు డీన్ జెడి.వెంకటేష్ ఆధ్వర్యంలో యోగా సాధన చేశారు. నేటి రాత్రి బెస్ట్‌గా నిలిచిన 5 బృందాలను బహు మతులతో సత్కరించనున్నారు. ఈ కార్యక్రమంలో ఎఐసిటిఇ ప్రతినిధులు 'యుక్తి' అంకుర సంస్థ వ్యవస్థాపకుడు ప్రణవ్ దీక్షిత్, ఐ 4 సి కంపెనీ మేనేజర్. సౌరభ్ ఉబాలే, ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.శ్రీనివాసరెడ్డి, డీన్ డాక్టర్ ఎస్.రమాశ్రీ, కో.ఆర్డినేటర్ ఎ.లక్ష్మణరావు, విభాగాధిపతులు పాల్గొన్నారు.

యానాం వార్తలు

నైటింగేల్ అవార్డుకు దరఖాస్తుల ఆహ్వానం

ప్రజాశక్తి - యానాం

పుదుచ్చేరి వ్యాప్తంగా ప్రభుత్వ, ప్రయివేటు ఆసుపత్రులు, స్వచ్ఛంద సంస్థల్లో అంకితభావంతో సేవలందించే నర్సులు, ఎఎన్ఎం, ఎల్‌హెచ్‌విలు తదితరులు 'నేషనల్ ఫ్లోరెన్స్ నైటింగేల్ అవార్డు' కోసం దరఖాస్తు చేసుకోవాలని పుదుచ్చేరి ఆరోగ్యశాఖ డైరెక్టర్ శ్రీరాములు కోరారు. దరఖాస్తు చేయడంలో సూచనలు, ఎంపిక ప్రక్రియ తెలుసుకోవడం కోసం health.py.gov.in వెబ్‌సైట్‌ను పరిశీలించాలని, పూర్తి చేసిన దరఖాస్తులను జనవరి 3లోగా పంపించాలన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న బ్యాంక్ మేనేజర్ రాజు

బ్యాంక్ సేవలు సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి - యానాం

యానాం పుదువై బ్యాంక్ అందించే సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మేనేజర్ కొప్పనాతి రాజు అన్నారు. ఈ మేరకు బుధవారం స్థానిక బ్రాంచ్‌లో వినియోగదారుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ బ్రాంచ్ రూ.35 కోట్ల అడ్వాన్సులు, రూ.27 కోట్ల డిపాజిట్లు కలిగి ఉందని తెలిపారు.ఫిక్స్‌డ్ డిపాజిట్‌లపై అత్యధిక వడ్డీ రేటు, హౌసింగ్ లోన్‌పై అతి తక్కువ వడ్డీ ఇస్తుందన్నారు.

ఉత్సవాల్లో పాల్గొన్న ఎంఎల్ఎ అశోక్ తదితరులు

యానాంలో క్రిస్మస్ సందడి

ప్రజాశక్తి - యానాం

యానాంలో క్రిస్మస్ సందడి నెలకొంది. యానాం ఎంఎల్ఎ గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ ఆధ్వర్యంలో బుధవారం స్థానిక బెజవాడ గార్డెన్స్ లోని ఆయన కార్యాలయం వద్ద క్రిస్మస్ సందర్భంగా యానాం క్రిస్మస్ సందడి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హెర్మోస్ మినిస్ట్రీస్ (ఏలూరు) పాస్టర్ జోషఫ్ కిషోర్, అలాగే కాకినాడ సివైఎఫ్ ఇంటర్నేషనల్ డైరెక్టర్ రెవరెండమ్ బిహెచ్‌వి.మూర్తిరాజు పాల్గొన్నారు. ఎంఎల్ఎ అశోక్ ఈ సందర్భంగా భారీ క్రిస్మస్ కేకును పాస్టర్ల సమక్షంలో కట్ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ క్రీస్తు బోధనలు అనుసరణీయం అని పేర్కొన్నారు. అందరికీ క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. ఆర్‌వి.పథ్వీ బృందం సంగీత కార్యక్రమం ఆకట్టుకుంది. 2 కార్యక్రమం అనంతరం ఎంఎల్ఎ ఆధ్వర్యంలో విందు ఏర్పాటు చేశారు. యానాం పరిసర ప్రాంతాల నుంచి క్రైస్తవులు, తదితరులు పాల్గొన్నారు.

పూజల్లో పాల్గొన్న యాత్రికులు

ఘనంగా దత్త జయంతి

ప్రజాశక్తి - పిఠాపురం

దత్త జయంతి ఉత్సవాలు బుధవారం ఘనంగా ప్రారంభ మయ్యాయి. దక్షిణ కాశీగా విరాజిల్లుతున్న పిఠాపురం పాదగయ క్షేత్రంలో దత్తాత్రేయ స్వామివారి ఆలయంలో దత్త జయంతి సందర్భంగా ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేవారు. ఆలయ ఇఒలు వడ్డీ శ్రీనివాసరావు, సౌజన్య ఏర్పాట్లు పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో పాదగయ దేవస్థాన ఛైర్మన్ ఆగంటి ప్రభాకర్ రావు, శ్రీపాద శ్రీ వల్లభ సంస్థానం ఛైర్మన్ ఆర్.జానార్తన్, అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు సర్టిఫికెట్ల అందజేత

ప్రజాశక్తి - పెద్దాపురం

మండల పరిధిలోని వివిధ పాఠశాలల విద్యార్థులకు నిర్వహించిన పోటీలలో నలుగురు విద్యార్థులు జిల్లా స్థాయి పోటీలో విజయం సాధించి విజయవాడలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారని వినియోగదారుల సంఘం డివిజన్ అధ్యక్షులు భళ్లమూడి సూర్యనారాయణ మూర్తి అన్నారు. పెద్దాపురం మండలం కొండపల్లి జిల్లా పరిషత్ హైస్కూల్‌లో బుధవారం జరిగిన సభలో విద్యార్థులందరికీ సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం ఎం.ఫణి కుమార్ పాల్గొన్నారు.

దస్తావేజులు పోయినవి

పూర్వపు పశ్చిమ గోదావరి జిల్లా, ప్రస్తుతం తూర్పు గోదావరి జిల్లా, నల్లజెర్ల మండలం, దూబచెర్ల గ్రామం, డోరు నెంబరు 3-176 నకు చెందిన కనసాని జగదీశ్వరి, భర్త: సత్యన్నారాయణ అను నా యొక్క ఇంటి ఒరిజినల్ దస్తావేజులు పోయినవి. దస్తావేజు నెం. 625/2009, ది.15-12-2023వ తేదీ శుక్రవారం నాడు పనిమీద దూబచర్ల నుండి భీమడోలు వచ్చినప్పుడు, భీమడోలులో ఈ దస్తావేజులు పోయినవి. దొరికినవారు ఈ క్రింది నెంబరుకు తెలియజేయగలరని నా మానవి.

కనసాని జగదీశ్వరి
సెల్: 90305 41449

ఒరిజినల్ దస్తావేజు పోయినది

తూర్పు గోదావరి జిల్లా, రాజమహేంద్రవరం పట్టణం, లలితానగర్, డోర్‌నెం.17-29-21 కాపురస్తులు అయిన **బత్తుల కొండయ్య** గారి కుమారుడు **బత్తుల వెంకటసాయిరెడ్డి** అను నేను నా ఒరిజినల్ **దస్తావేజు నెం.6108/2019** తేది.**13-9-2019** SRO పిడింగొయ్యి నెంబర్లు గల ఒరిజినల్ దస్తావేజు **15-12-2023**వ తేదీన నేను నా ఇంటి నుండి రాజమండ్రి CTRI కాపురస్తులు అయిన MNRC యాదవ్ గారికి ఇచ్చుటకు బయలు దేరి వెళ్ళుచుండగా మార్గం మధ్యలో పడిపోయినది. ఎంత వెతికినా కనిపించలేదు. కనుక పై నెంబర్లు గల దస్తావేజు ఎవరికైన దొరికిన యెడల ఈ క్రింది అడ్రస్‌కి తెలియపర్చవలసిందిగా కోరుచున్నాను.

బత్తుల వెంకట సాయిరెడ్డి
డోరునెం.17-29-21, జెమింధార్ మెట్ట, లలితానగర్, రాజమహేంద్రవరం. సెల్: 9912174444